లేదు. బతికి బావుంటే మేనమావ కూతుర్ని చేసుకోవచ్చు. లేక పోయినా ఫరవాలేదు, కాని అలాగే అక్కడే ఆ సందులోనే ఒక అరగంట నిద్రపోనిస్తే బావుండు ననిపించింది. కానీ సుశీల అతన్ని నిద్రపోనివ్వలేదు.

ఆవిడ శ్రీనివాసరావు కంటే ఎక్కువ సినిమాలు చూస్తుంది. తెలుగు, హిందీలే కాకుండా, అరవ, కన్నడ, మళయాళ వగైరాలన్నీ చూస్తుంది. "బంగారపు బొమ్మ"లో యిలాగే విలన్ ఒక లాలూచి రౌడీని హీరోయిన్ మీదికి వదిలి ఆవిడని రక్షించినట్టు నటించి, ఆమెని పెళ్ళాడి అంట్లు తోమించి నానా బాధలు పెట్టేడు.

"... ఇలా బేడా పరక ఆలోచన్లకి పడే రకాన్ని కాదు నేను. ఏవనుకుంటున్నావో! కాని ఆ రౌడిగాడ్ని వదిలి నన్ను రక్షించి నట్టు నటించి నువ్వు పెళ్ళాడేద్దామను కున్నా వేమిటో.." వారం నుండి చూస్తున్నాను. కుక్కలా నావెంటే .... సుడిగాలి వెళ్ళి పోయింది సుశీల రూపంలో.

ఘటోత్కచుడి దెబ్బకైనా తట్టుకున్న అతను హీరోయిన్ దెబ్బకి తట్టుకోలేకపోయాడు.

**(అనామిక, 1.2.1975)**

# పట్నపురాణి తలపోటు

**ఆ** రోజు ఆదివారం.

అష్టమి, అర్ధరాత్రి, పన్నెండుదాటి పది నిమిషాలైంది. అష్టమి చంద్రుడు అతి కష్టంగా డ్యూటీకి వచ్చి పెందలాడే లీవు తీసుకొని పోయేడు.

పిల్లగాలులు చల్లగా, చలిగా తగుల్తున్నాయి.

అది చీకటి రాత్రో వెన్నెల రాత్రో తెలీకుండా చీకటి, వెన్నెల కలిపి నేసిన కలనేత కోకలా ఉంది ఆకాశం.

వయసు వేడిలో చంద్రుడితో పాటు చిందులాడిన చుక్కలు చంద్రుడు పోగానే చలి గుర్తుకొచ్చి కాబోలు గడగడ వణికి పోతున్నాయి.

మోడెల్లా వారి ఊలు దుప్పటిలా దిగిందియింతలో ఓ నల్ల మబ్బు.

అప్పటి వరకు చంద్రుడికి కన్నుకొదుతున్న నక్షత్రాలు మబ్బు దుప్పటి కోసం కలబడి కొట్టుకుంటున్నాయి, మార్చి, మార్చి కప్పుకుంటున్నాయి.

మొత్తంమీద ప్రపంచం, ప్రకృతి అంతా నిశ్శబ్దంగా నిద్ర పోతోంది. ఎటొచ్చీ నిశ్శబ్దంగానే వున్నా నిద్రపోనివి ఊరికి ఒక చివరున్న బంగళా, రెండో చివరున్న స్మశానం.

ఊరికి కొంచెం దూరంలో కాస్త మెరుగ్గా వున్న స్థలంలో వున్న ఆ బంగళా వేటకొచ్చిన రాజుగార్లా గంభీరంగానూ, దర్జాగానూ ఉంది.

భయంతో చేతులు కట్టుకొని బాబుగారి ముందు నిల్చున్న బానిసల్లా వున్నాయి ఊర్లో అక్కడక్కడున్న పాకలు.

రాజుగారు వేటాడి తెచ్చిన మృగాల్లా వున్నాయి ఆ పాకల మధ్య రెండు పెంకుటిల్లు.

స్మశానంలో మంటలే గాని మనుషుల్లేరు.

బంగళాలో మనుషులు మంటల్ని మింగేసిన వాళ్ళలా గాబరాగా ఉన్నారు.

వాళ్ళు అసలు మనుషుల్లా కాకుండా దెయ్యాల నీడల్లా తిరుగుతున్నారు.

బిగుసుకొని పోయిన వాళ్ళ మొహాలు చూస్తుంటే బహుశా ఆ బంగళా మరో నిమిషంలో పేలిపోతుందేమోనన్న భయం వేస్తుంది.

ఆ భయానికి ఒంట్లో వున్న రక్తం అంతా నీరైపోయినట్టు అందరూ పాలిపోయి ఉన్నారు.

బంగళా అంత విశాలంగా వున్నా పక్కవాడి ఊపిరితోనే ప్రాణం పోసుకుంటున్నట్టు ఒకడి మొహంలో ఒకడు మొహం పెట్టి అర్థం కాని ప్రశ్నార్థకాలు వేసుకుంటున్నారు.

అసలెవరు వీళ్ళంతా?

ఇంకెవరు జమీందారు రామనాథం గారి దాసజనం.

వాళ్ళంతా అలా భయంతో వణికిపోతున్నారేం?

పక్కనున్న అడివిలోంచి పెద్ద పులో, సింహమో తప్పించుకు వచ్చెయ్య లేదు కదా!

బావుంది, పక్కన అడివే లేందే!

పక్కనున్న ఒక్క సముద్రం ప్రశాంతంగా ఉందే.

మరి?

"ఓలమ్మ. పాపం, ఆయమ్మకి ఒకటే తల పోటంట. కన్నెత్తి చూళ్ళేక పోతన్నాది. పన్నెత్తి మాటాళ్ళేక పోతన్నాది. అదేం మాయదారి తలపోటో, ఏటో ఆయమ్మకే రావాలా?" పక్కవాడి చెవిలో బాదపడిపోతోంది పనిమనిషి ముత్యాలు.

"ఉష్" మాటాడొద్దన్నట్టు పాములా బుసకొట్టేడు పావలా మొహం పెట్టుకున్న పక్కవాడు.

అప్పటికి అరగంట నుండి కాబోలు పద్మావతీ దేవిగారు తల నొప్పితో తలక్రిందులై పోతున్నారు. పాపం ఆవిడక్కడికి ఆ సాయంత్రమే వచ్చేరు, భర్త రామనాథంగారితో కలిసి.

రామనాథం గారంటే, పట్నంలో ఓ 'త్రీస్టార్' హోటలు, రెండు ఏ.సి. థియేటర్లు, మూడంతస్తుల మేడవున్న ఒక పెద్ద ఆసామి. ఇవిగాక ఆయనకింకా చాలా వ్యాపారాల్లో చాలా రకాల పేర్లున్నాయి.

వారి తాతగారిది–వారి పేరు రామనాథంగారే – ఈ పల్లె టూరే, వారు 500 ఎకరాల మోగాసాదారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆ ఊరిని కేంద్రంగా తీసుకొని ఓ ముప్పై మైళ్ళ దూరంలో ఒక సున్నా చుడితే ఆ లోపలున్న భూములు, మను షులు, చెట్లు, గట్లు, కుక్కలూ, కాకులూ, ఆస్తులూ, ఆడవాళ్ళూ అన్నీ వారివే! వారి తదనంతరం వారి కుమారుడు – అంటే రామనాథం గారి తండ్రిగారు పట్నానికి మకాం మార్చేశారు. తండ్రిగారి ఆస్థిలో అరంగుళం భూమిగాని, అర్ధరూపాయి డబ్బు గాని తరగకుండా పట్నంలో ఉల్లిపాయల వ్యాపారం చేసేరు. పట్టినదల్లా పంచదారై పోయింది. ఉల్లిపాయలు రెండు పంచ దార మిల్లులైపోయేయి.

అందుకే కాబోలు ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చెయ్య దంటారు.

కాని ఏం లాభం? ఉల్లిపాయల్ని వదిలి పంచదారని చేప ట్టారు. చివరకాయన షుగర్ కంప్లేంటుతోనే కాలం చేసారు.

ఇప్పటి రామనాథం గారు తండ్రిగారి పంచదారను హోట ల్సులోకి, సినిమా హాల్సులోకి మార్చేసారు. వారి భార్య పద్మావతీ దేవి, కాపరానికొచ్చేసరికి ఆమెకి 20 ఏళ్ళు. 200 కాసుల బంగారం, 80 పౌన్ల బరువు ఉండేది. ఇప్పుడామెకి 40 ఏళ్ళు. 2000 కాసుల బంగారం, 180 పౌన్ల బరువూ ఉన్నాయి. పెళ్ళ యినప్పటి నుంచి ఆవిడని రామనాథం గారు ఎ.సి. మేడల్లోనే పెంచేరు. ఏ మాట కామాటే చెప్పాలి. బంగారాన్ని రామనాథం గారు పెంచినా, కాలం వయసుని పెంచినా, పెరిగిన నూరు పౌన్ల బరువనీ ఆవిడే స్వంతంగా కేవలం ఐస్ క్రీమ్సుతోటీ, యాపిల్ జ్యూస్‌తోటీ పెంచింది.

రామనాథంగారి అయిదు ప్రాణాలు ప్లస్ ఒక మానం ఆవిడే. ఆవిడకి పుట్టినప్పటి నుంచి పట్టు అంటే ఎంతో ప్రేమ. పట్టు చీరలు, పట్టుపరుపులు, పట్టు దుప్పట్లు ఒకటే మిటి? రామ నాథం గారావిడని పట్టు మనిషిగానే తీర్చి దిద్దేరు. ఆవిడ ఎప్పుడు చూసినా సరే పాలతో స్నానం చేసిన దాన్లా తెల్ల తెల్ల గానూ, పట్టు పరుపులా మెత్త మెత్తగానూ వుంటుంది.

తన స్వంతానికి రామనాథంగారు ఇండియన్ కారే కొను క్కున్నా, ఆవిడకి మాత్రం ఫర్లాంగు పొడవు ఫారిన్కారు కొన్నారు. పాపం, డ్రైవరు మాత్రం ఫారిన్ వాడు దొరకలేదు. అయితేనేం, ఆవిడ గదిలో ఫ్రాస్ట్ ఫ్రీ ఫ్రిజ్ ఫారిన్‌ది, అందులోని బాటిల్స్ ఫారిన్‌వి. సాధారణంగా అందం, ఐశ్వర్యం వున్న వాళ్ళకి పిల్ల లుండరు. కాని పద్మావతీ, రామనాథాలకి ఏ నోములూ నోచ కుండానే, ఏ పాములకీ పాలు పోయకుండానే అమ్మాయి పుట్టింది. ఇప్పుడా అమ్మాయి ఎంచక్కా అమెరికాలో ఉంటోంది. అల్లుడు ఇంగ్లండులో ఆటోమొబైల్ ఇంజనీయరు.

మరింక ఆవిడకేం తక్కువ?

ఊపిరి పీల్చుకోవడం మినహా ఆవిడ ఏ పనీ స్వంతంగా చేసుకోనవసరం లేదు. అయినా అదేవిటో గాని ఆవిడ పట్టుమని పది మెతుకులుకూడా తినలేదు. తింటే కడుపు నొప్పీ, పొలమార డమూను.

పట్టుమని పది అడుగులు నడవలేదు.

నడిస్తే గుండె దడ, ఆయాసం, జారి పడిపోవడం. పోనీ ఏ పనీ చెయ్యకుండా కూర్చుందావన్నా పది నిముషాలు కూర్చుంటే కాళ్ళూ చేతులు తిమ్మిరెక్కిపోతాయి.

వారికేం డబ్బు కొదువా?

పలుకుబడి తక్కువా?

ఢిల్లీ మొదలు, వెల్లూరు వరకు దేశంలో ఎన్నో పెద్ద హాస్పి టల్సు తిరిగేరు. పెద్ద డాక్టర్లు అనుకున్న వాళ్ళందర్నీ చూసేరు. కాని ఫలితం జబ్బులు జబ్బుల్లాగే ఉన్నాయి. ఆ మధ్య నెల్లూరులో

కాబోలు ఒక డాక్టరు ఈమెకు శారీరకంగా ఏవీ జబ్బు లేదని పిస్తోంది. గాలి మార్పు ఎంతైనా అవసరం, కొన్నాళ్ళపాటు ఏ స్విట్జర్లాండు తీసికెళ్ళండని వెయ్యిన్నూట పదహార్ల సలహా యిచ్చేడు.

జబ్బేమీ లేదన్నందుకు మొదట అతనిమీద కోపం వచ్చినా స్విట్జర్లాండు వెళ్ళమన్నందుకు సంతోషం కలిగింది పద్మావతీదేవికి.

కానీ ఏదీ! ఎప్పుడు వెళ్దామనుకున్నా ఏదో వ్యాపారపు గొడవలు అతన్ని కదలనివ్వడం లేదు. ఆఖరికి కాశ్మీరు, ఊటి, సిమ్లా వగైరాలు కూడా విసుగొచ్చేశాయి. అంచేత ఏదో కొంతైనా ఛేంజ్ కోసమని పల్లెటూర్లోనీ తమ తాతల నాటి బంగళాని పదివేలు పెట్టి పదిరోజుల్లో రీమోడల్ చేయించి వీకెండ్సులో వద్దామనుకున్నారు. స్విట్జర్లాండులో లాగ మంచుకొండలు లేక పోయినా యిక్కడున్న పొగమంచు గుట్టల్తోనే సరిపెట్టుకుందా మన్న సదుద్దేశంతో ఈ మారుమూల పల్లెటూరికి వచ్చేరు.

నిన్న సాయంకాలం అనగా బయలుదేరేరు. దూరం ముప్పై మైళ్ళే అయినా, మూడుగంటలు పట్టింది ఈ ఊరు చేరుకోవ డానికి.

కారైతే ఫారిన్‌దే. కాని ఏం లాభం? రోడ్లు ఇండియావి. వెధవ డర్టీ రోడ్స్, ఫిల్టీ పీపుల్.

కారైతే ఫారిన్‌ది కొనుక్కుంటాం గాని, ఫారిన్ రోడ్లెక్కడ వేయించుకుంటాం. సరే వేయించుకుంటాం. నాగరికత అంటే తేలీని ఈ జనం సక్రమంగా వాడతారా? అందుకే అలనాడు తుగ్లక్ రాజధానిని ఢిల్లీ నుండి దేవగిరికి మార్చి రీమోడల్ చేసి అక్కడి ప్రజలతో విసిగిపోయి కల్చర్ తెలిసిన ఢిల్లీ ప్రజలనే దేవగిరికి రమ్మన్నాడు. ఇక్కడి మనుషులకీ, పశువులకీ బొత్తిగా రోడ్ సెన్స్ వున్నట్లు లేదు. సీజను కాబోలు రోడ్లు పొడవునా చెరుకు బళ్ళే. ఆ రోడ్లు మీద ఎన్ని గతుకులున్నాయంటే కూర్చు న్నది కార్లో అయినా, పడవమీద కూర్చుని పర్వతాల మీద పోతున్న ఫీలింగ్ వస్తుంది. ఆ రోడ్డు మీదకొత్తకారు గాని నాలుగు సార్లు తిరిగితే చాలు, లారీటా మారిపోతుంది. రామనాథం గారు తల్చుకుంటే తెల్లారేసరికి సిమెంటు రోడ్డు వేయించగలరు. కాని వేయించరు – దానికి చాలా కారాణాలున్నాయి.

రోడ్డు మీద రామనాథం గారు కారు పడవలా ఊగుతోంది. గుంటల్లో పడ్డప్పుడు కారు గట్టుమీద పడ్డ చేపలా గెంతుతోంది. అందులో కూర్చున్నది గర్భిణీ స్త్రీయే అయితే ఎక్స్‌పెక్టెట్ డేట్ ఆఫ్ డెలివరీ అనెక్స్‌పెక్టెడ్ గానే ఇప్పుడే వచ్చేస్తుంది. ఎలాగైతేనేం గతుకులూ గండాలు దాటి జీవాల్ని బంగళా చేర్చేరు. వేడి వేడి నీళ్ళలో చందనం అత్తరు వేసుకొని స్నానం చేసిన తరువాత పద్మావతీ దేవి గారికి పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్ట యింది. కొంత హాయి అనిపించి హమ్మయ్య అనుకోవడం పిడుగు పాటులా తలనొప్పి రావడం ఒక్కసారే జరిగిపో యేయి.

అంతే – రామనాథం గారి మనసంతా వికలమై పోయింది. ఆయనలో పుట్టకూడదని పుట్టు కురుపులా వైరాగ్యం పుట్టు కొచ్చింది.

ఇంత డబ్బు, ఇన్ని ఫ్యాక్టరీలు ఇంతమంది నౌకర్లు దేనికి? ఆఫ్టరాల్ ఈ తలనొప్పి తగ్గించలేకపోతే – ఛీ! పోతాను ఇవన్నీ అమ్ముకొని ఫారిన్ పోతాను. అక్కడే సెటిలై పోతాను.

కాని అంతవరకు ఈ తలనొప్పి తగ్గించేదెలా?

అక్కడేదో వుంటుందనుకొని పరుగు పరుగున ఎత్తైన కొండెక్కి అంత ఎత్తు దిగాలే అని దిగులుగా కూర్చున్న కుర్రాడిలా వుంది ఆయన పరిస్థితి.

ఆయనకి ఆ ఊరంగా వింతగా వుంది. పశువులకీ, మనుష లకీ తేడా వున్నట్టు లేదు. ఆ ఊర్లో ఉన్నది పశువుల డాక్టరో మనుషుల డాక్టరో తెలీదు. అందరికీ ఒకడే డాక్టరుట. అతను కూడా ఆ సాయంత్రం వేళ పక్కనున్న పల్లెటూర్లో ఏదో అర్జెంటు కేసు మీద వెళ్ళేడు. తెల్లారేవరకు రాడు.

పోనీ కార్లో వెళ్ళి క్షణంలో తీసుకొని రావచ్చునే.

చిత్తం. ఆ ఊరు ఎడ్లబండి తప్ప ఏదీ వెళ్ళదు బాబు గోరూ.

పద్మావతీ దేవిగారు రామనాథం గార్ని, బాధనీ భరించ లేకపోతున్నారు.

రామనాథం గారు ఆవిడ బాధ చూడలేకపోతున్నారు. మరో అరగంటలోగా ప్రపంచం అంతా గాలించైనా సరే ఒక డాక్టర్ని తేకపోతే అందరి ఉద్యోగాలు పీకేస్తానని నౌకర్లకి, గుమాస్తాలకి వార్నింగిచ్చేరు.

అదిగో, అందుకే వాళ్ళంతా భయంతో బిగుసుకుపోయేరు.

ఎవ్వరికీ ఏం పాలుపోవడం లేదు. పాలుపోయిన వో నౌకరు ఓ గ్లాసుడు వేడిపాలు తెచ్చిచ్చేడు.

ఆవిడ విసిరికొట్టింది.

"యీది మొగన బడ్డీ కొట్టుకాడ తలపోటు మాత్తర్లు అమ్ముతాడు. అవి బట్టుకొస్తే" అని ఒక బ్రిలియంటు అయిడియా వచ్చింది ఒక పదిహేనేళ్ళ పనిపిల్లకి.

"సీ ఒల్లకో అమ్మగోరనుకన్నావా? పకీరు పెళ్ళామను కొన్నావా? ఆఖరికి పదిపైసల బిళ్ళలకే తలనొప్పి తగ్గుద్దేటి? బతికి బాగుపడాలనుంటే యిలాంటి ఎదవ మాటలాడక ఒల్లకో అని కసిరేడు పక్కనున్న పకీరుగాడు.

అయితే మేనేజరు మంగపతి మాత్రం పిరికి వాడు కాదు. అతని బుద్ధి పాదరసం లాంటిది. అవసరాన్ని బట్టి ఎంత ఎత్తైనా పెరుగుతుంది. అతను పాతికేళ్ళ నుంచి ప్రభువు వారి కొలువులో వుండి యిలాంటి గండాలెన్నో దాటేడు.

పాదరసం మరీ పెరిగి బుర్ర బద్దలౌతుందేమో, భుజం మీద తువ్వాలు బుర్రకి చుట్టుకొని ఊర్లోకి బైల్దేరాడు. ఏదైనా ఉపాయం దొరక్కపోతుందా అని.

వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి.

పద్మావతీ దేవి బాధ తెలీకనిద్రపోతున్న ఊరుని చూచిమహా చెడ్డ చికాకేసింది మంగపతికి.

ఎక్కడో దూరంగా ఒక కుక్కపిల్ల మాత్రం చచ్చిపోయిన తల్లిని తల్చుకొని ఏడుస్తోంది.

పల్లపు వీధిలోని పాపారావు పెద్ద కొడుకు పట్నంలో డాక్టరీ చదువుతున్నాడు. అతను గాని శలవలకి వచ్చేడేమో!

పరిగెత్తికెళ్ళి పాపారావు గారి తలుపు కొట్టేడు. పాపారావు గారున్నారు కాని వాళ్ళబ్బాయి లేడు. పై వారం గాని రాడు.

పైవారం వరకు ఆవిడ తలనొప్పి సంగతేమో గాని, తను బతికుంటే కదా!

మళ్ళీ పిచ్చెత్తినవాడిలా రోడ్లన్నీ పచారు చేస్తున్నాడు మంగపతి.

అప్పుడే ఇరవై నిముషాలై పోయింది.

కాలం పరిగెడుతోంది.

మంగపతి మాత్రం నిలిచిపోయేడు.

అలా నిల్చిపోయిన అతనికి ఎడారిలో ఎండమావిలాంటి ఆశారేఖ కూడా కనిపించక దాహంతో దేహం చాలిస్తున్న వాడికి ఎదురుగా ఒయాసిస్సులా–ఎదురింట్లో గేటు మీద నల్లటి బోర్డు కనిపించింది.

అప్రయత్నంగా కళ్ళజోడు తీసి కళ్ళు చిట్లించి చూశాడు.

ఏవో తెల్లటి అక్షరాలు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి.

దగ్గరకెళ్ళి వాటిని విడివిడిగానూ, కలిసి గుణించగా మొత్తం డా॥ ధర్మారావు అని తేలింది.

అమావాస్యనాడు పున్నమి చంద్రుడ్ని చూసినట్టు పీలయ్యేడు.

నెలాఖరురోజుల్లో లైటులేని సైకిలు దొరికిన బీటు కానిస్టేబుల్లా సంతోసంతో పొంగిపోయేడు.

ఆగిపోయిన గుండె తిరిగి కొట్టుకుంటోంది.

అమాంతం వెళ్ళి ఆ ధర్మారావుని కౌగిలించుకొని ముద్దు పెట్టుకోవాలనిపించింది. అరక్షణం ఆలశ్యం చెయ్యకుండా గబ గబా ఆ ఇంట్లోకి పరిగెత్తాడు.

ఏవఁదృష్టం!!

ఆ ఇంటి తలుపులు తీసేవున్నాయి.

ధర్మారావు గారు కూడా ఉన్నారు. మంచంమీద పడుకొని ఏదో పుస్తకం చదువుకుంటున్నారు. పుస్తకం సైజు కూడా మెడికల్ పుస్తకం అంతే వుంది.

హఠాత్తుగా అర్ధరాత్రి తన ఇంట్లో ప్రవేశించిన మంగపతిని చూసి ఆయనకి ఏవీ అర్థంకాలేదు. దొంగ అయివుండడు ఎంత తెగించిన వాడైనా అలా లైటు వేసి వున్న ఇంట్లోకి అంత అర్జంటుగా ఏ దొంగా పరిగెత్తడు. ఆయన ఆ ఊరొచ్చి ఆర్రోజులే అయింది. అంచేత యింకా ఎవర్కీ తెలీదు.

"ఎవరు మీరు? ఏం కావాలి? అన్నారు పుస్తకం మూసివేస్తూ.

మంగపతి సంతోషంతో నోటమాట రావడం లేదు. ఆలశ్యం చేస్తే శాశ్వతంగానే రాదు. తన మూగతనానికి తననే తిట్టుకుంటూ ధర్మారావు గారిని తనతో రమ్మనట్లు సంజ్ఞ చేసి పక్కనున్న కూజాలోని నీళ్ళు గ్లాసులో పోసుకోకుండా కూజాతోనే గటగటా తాగేసేడు. ఎదురుగా స్టాండుమీదున్న షర్టు తీసి ధర్మారావుగారికిచ్చేడు తొడుక్కోమన్నట్టు.

ధర్మారావుగారు తొడుక్కున్నారు.

క్షణం ఆలశ్యం చేస్తే దక్కడేమో అన్నట్టు అతని చెయ్యి పట్టుకొని లాక్కుపోవడం ప్రారంభించేడు. ధర్మారావు గారికి భయం వెయ్యకపోయినా ఆశ్చర్యం వేసింది. తోవలో సంతోషం షాక్ నుంచి తేరుకున్నాక చెప్పేడు మంగపతి, పద్మావతీ దేవీ గారి తలనొప్పి వైనం.

"నేను.." ఏదో అనబోయేరు ధర్మారావు గారు.

"బాబ్బాబు – మీరేం చెప్పకండి. ఈ గండం గడిపే రంటే నాకు పుట్టబోయే పిల్లకి మీ పేరే పెట్టుకుంటాను. (పుట్టబోయే పిల్లలు ఇప్పటి కాయనకి చాలా మంది పుట్టేరు) రామనాథం గారి సంగతి తెలీదు కాని నేను మాత్రం స్వయంగా వెయ్యిన్నూట పదహార్లు యిచ్చు కుంటాను.

ఇద్దరూ బంగళా చేరేసరికి గడువుకింకా అయిదు నిమిషాలే వుంది. ధర్మారావుని చూసిన నౌకర్లు భగవంతుడు ముందు భక్తుల్లాగ భక్తితోను, భయంతోను దణ్ణాలు పెట్టేరు. మంగపతికి కృతజ్ఞతాపూర్వకంగా నమస్కారం చేశారు. ధర్మారావుగారి కిదంతా తమాషాగా, కొత్తగానూ వుంది.

అదేవిటి తలనొప్పా? భూకంపమా?

వాళ్ళు వెళ్ళేసరికి పద్మావతీ దేవి పందిరి మంచంపైన పట్టు పరుపుల మధ్య పట్టపుటేనుగులా పడుకొని ఉంది. ఆవిడ కాళ్ళదగ్గర ఏనుగు మీంచి పడిపోయిన మావటి వాడిలాగ తల పట్టుకొని రామనాథం గారు కూర్చున్నారు.

ధర్మారావుగార్ని చూసిన పద్మావతీ దేవి లేవటానికి ప్రయత్నించినా శరీరభారమో, శిరోభారమో గాని ఆవిడని లేవ నివ్వలేదు. అంచేత ఆవిడ అతనివేపు చూసి వీక్‌గా నవ్వారు.

ధర్మారావు గారు ఆవిడ నవ్వుకి జవాబుగా అభయం ఇస్తున్న ఆపద్బాంధవుడి నవ్వొకటి నవ్వి, ఏం ఫరవాలేద న్నట్లు రామనాథంగారి భుజం నిమిరి.

ఏమిటమ్మా బాధ అనడిగేరు. అంతకంటే ఎక్కువడిగితే కోపం వస్తుందేమోనని.

విపరీతమైన తలనొప్పి అని రామనాథంగారే సమాధానం చెప్పి కదూ పద్మా అనికూడా కలిపేరు – కాదేమోనన్నట్టు.

అవునంతే అన్నట్టు తల ఊపేరు ఆవిడ.

ఇంకేవైనా ఉన్నాయా? కొంచెం ధైర్యం చేశారు ధర్మారావు గారు.

పద్మావతీ దేవి గారి మొహంలో కొంచెం విసుగును కని పెట్టిన రామనాథం గారు మీరెక్కడ చదివేరు డాక్టర్! అన్నారు.

లండన్‌లో.

ఫారిన్ డాక్టరన్న మాట! పద్మావతి గారి మొహం తిరిగి వికసించింది.

ఏదో చెప్పాలన్నట్టు పద్మావతీ దేవి గారి పెదిమలు కదల బోయేయి. ఈలోగా రామనాథం గారు నువ్వూరుకో పద్మా మళ్ళీ గుండె దడ, ఆయాసం వస్తాయి. నేను చెప్తానులే అని ఆవిడని అనునయించి "నిల్చునేవున్నారు, కూర్చోండి డాక్టర్" అదేవిటో గాని ఆ గదిలోంచి ఈ గదిలోకి నడిస్తే గుండె దడ అంటుంది. మేడదిగితే నీరసం అంటుంది. షీ యీజ్ వెరీ డెలికేట్. ఈ మధ్య వెల్లూరు, ఢిల్లీ అన్నీ తిప్పేశాను. తలనుంచి పాదం వరకు అన్ని టెస్టులు చేశారు. జబ్బేమీ కనిపించలేదం టారు. అఫ్‌కోర్స్ నాకు మన డాక్టర్ల మీద నమ్మకం పోయింది. మీరేం అనుకోకండి–యిలా అంటున్నానని. అందుకే ఏ రష్యాకో, అమెరికాకో తీసుకొనిపోదామను కుంటున్నాను" అని ధర్మారావు గారి అభిప్రాయం కోసమన్నట్టు ఆగేరు.

ధర్మారావుగారేం అన్లేదు కాని అంతవరకు ఉదయం ఎని మిది గంటల ఎండకే వాడిపోయిన గులాబిలా వున్న పద్మావతి దేవి గారి మొహం రామనాథంగారి మాటలతో మంచులో తడిసిన మల్లెపువ్వులా వికసించింది. అంతలోనే తలనొప్పి జ్ఞాపకం వచ్చి మళ్ళీ ముడచుకుపోయింది.

పద్మావతీ దేవిని అమెరికాకో, రష్యాకో తీసుకొని వెళ్ళడంపై తన అభిప్రాయం చెప్పకుండా "నాతో ఎవరినైనా పంపండి మందిస్తాను" అంటూ లేచేరు ధర్మారావు గారు.

వెంట వెళ్ళేడుమంగపతి.

మర్నాడు పొద్దున్నే కొంచెం ఆలస్యంగా నిద్రలేచిన ధర్మారావు గారు వరండాలో కుర్చీలో కూర్చున్న మంగపతిని చూసి ఆశ్చర్య పోయేరు. తరువాత చిన్నగా నవ్వుకున్నారు.

ఉపోద్ఘాతం లేకుండా మంగపతే ప్రారంభించేడు. "మా బతుకులు నిలబెట్టేరు. మీ ఋణం మేము తీర్చుకోలేం. కాని ఏదో మా శక్తి..." అంటూ సంచిలోంచి అరటిపళ్ళు తమల పాకులు తీసి టేబిలుమీద పెట్టి, ఒక కవరు అతని చేతిలో పెట్టేడు.

ధర్మారావు గారు కవరు తీసుకోకుండానే నవ్వుతూ "ఎలా వున్నారు ఆవిడ?" అన్నారు.

"బ్రహ్మాండంగా నిద్రపోయేరు. మళ్ళీ ఎక్కడ తలనొప్పి వస్తుందోనన్న భయంతో మేమెవ్వరం నిద్రపోలేదనుకోండి. మీరిది స్వీకరించక తప్పదు. మీరు చేసిన మేలు మీకు తెలీదు. కాదనకండి" అంటూ బతిమాలేడు.

ధర్మారావుగారు తీసుకోలేదు. కాని ఎదురుగా కుర్చీలో కూర్చున్నారు. కూర్చున్నాక మంగపతిని ఎగాదిగా చూచేరు. చూసిన అతనికి జాలేసింది. ఒక మనిసి తలనొప్పి మీద ఇంత మంది బతుకులు ఆధారపడ్డాయా?

వాటే పిటీ?

చూడండి. మీ పేరేమిటన్నారూ?

చెప్పేడు మంగపతి.

మంగపతి గారూ మీరనవసరంగా హైరానపడకండి. మీరెవ్వరూ నాకేం ఋణం లేరు. ఆవిడకే జబ్బూ లేదు. డబ్బు ఎక్కువైపోవడం తప్ప నేనిచ్చినవి రెండు శాకరీన్ టాబ్లెట్లు. ఇంతకీ నేను డాక్టర్ని కాను యూనివర్సిటీలో బోటెనీ ప్రొఫెసర్ని, శలవలకని వచ్చేను. అంటూ కవరు తీసి మంగపతి జేబులో పెట్టేశారు డాక్టర్ ధర్మారావు ఎం.ఎస్.సి.పి; హెచ్.డి.

**(విజయ, 1.5.1976)**

# పూజా ఫలం

**ప్ర**తి ప్రాణి పుట్టింది మొదలు గిట్టే వరకు ఏవో పనులు చేస్తూనే వుంటుంది. ఆ పనులు సాధారణంగా ప్రకృతి పోసిన ప్రాణాన్ని పెంచుకుందామనో సొమాటిక్ (Somatic) లేక తన తదనంతరం తన ప్రాణాన్ని తనవారికి పంచి యిద్దామనో రీప్రొడక్టివ్ (Reproductive) జరుగుతాయి.

అయితే ప్రకృతి నుంచి మేథస్సును తానే ప్రత్యేకంగా పుణికి పుచ్చుకున్న మానవుడు మాత్రం అంతటితో తృప్తి పడడు, తన మానసికోల్లాసం కోసం కొన్ని ఆశలు, వాటి చుట్టూ మమకారాలు పెంచుకుంటాడు. అవి తీరని తరుణంలో, తన్ను తాను తమాయించుకునే ప్రయత్నంలో ఓ ఔట్‌లెట్ ఫెనోమీనా (Outlet phenomena) గా పక్కదార్లు పడతాడు. ఈ పక్కదాట్లు బతుకు భారంతో విసిగినప్పుడు. ఓ బూతు కబురు ప్రేరణతో ప్రారంభమై కలం సాగనప్పుడో సిగరెట్టు వెలిగించడంతో ఆరంభమై యింకా స్తోమత వుంటే బాధానివృత్తి నెపంతో ఓ బీరు బిగించడం లేదా నల్లమందు నిద్రలో కలలు కనడం వగైరాలుగా వృద్ధి చెంతుతాయి. ఇవి పక్కదాట్లలో కొన్ని మాత్రమే. ఈ పక్కదాట్లూ, వాటి ఫలితాలూ శాశ్వతాలు కావు. మోతాదు మించితే సమర్ధనీయాలు అంతకంటే కావు. సీసాలో పాలు అయిపోయిన తర్వాత పసిపిల్ల నోట్లో పీకలాంటివి. యివి తాత్కాలికంగా ఏదో ఏడుపుని ఆపగలవేగాని, అసలైన ఆరోగ్యానికివి ఎంత మాత్రం మంచివి కావు. ఎక్స్‌ట్రనల్ స్ట్రగుల్ (external struggle) తో నిలిచి నిలబడ లేనప్పుడు నిలిచి నిలబడలేనప్పుడు ఇంటర్నల్ డిజైర్స్ (internal designs) అణచు కోలేనప్పుడు, వాటి మధ్య పడి మనిషి నలిగిపోతూ వుంటే ఏ ఔట్‌లెట్ (outlet) అందకుండా వుంటే, ఇలాంటివే ఎమోషనల్ ఔట్ బరస్ట్స్ (emotional out bursts) గా బైటపడతాయి. వీటికే డాక్టర్లు హిస్టీరియా అనీ, సైకోసిస్‌లనీ రకరకాల పేర్లు పెట్టి, వీళ్ళు కట్టే ఊహా సౌధాల నుంచి ప్రతినెలా అద్దెలు వసూలు చేసుకుంటూ ఉంటారు.

అనుకున్న ఆశయాలు అందుకోలేనప్పుడు తెంచుకున్న ఆశలు తుంచుకోలేనప్పుడు అందని ద్రాక్షలు పుల్లన అని వదిలేస్తారు కొందరు. కాని, ఎప్పటికైనా అవి అందవా, అప్పుడైనా అవి తియ్యగా ఉండవా అన్న ఆశతో పరిసరాల్ని మరచి, నేల విడిచి, నింగికి ఎగురుతూనే ఉంటారు. అలా భూమ్మీదే ఉండి స్వర్గాన్ని కెగిరే ప్రయత్నాల్లోదే ఒకటి 'పూజ'లేక 'ఆరాధన'.

ప్రతి పనికి ఏదో ఒక ఫలం ఉంటుంది. మంచో, చెడో, ఫలం మంచిదై, పరిపక్వమైతే ఆరగించి ఆనందించవచ్చు. అదే ఏ చెక్క చెట్టుకో చెక్కుకున్న కాయలైతే, అవి ఎంత మంచివైనా చూపుల్తో రుచి చూడాల్సిందే తప్ప చేతికందిరావు. ఆ ఆర్టు కేవలం తత్త్వవేత్తలకే పరిమితం. సామాన్యులకది అసామాన్యం, అనూహ్యం, అనవసరం కూడా.

పూజాపునస్కారాలు గంతులేస్తూ కోలాహలంగా చేసినా, చతికిలబడి సమాధిలో వుండి చేసినా వాటి ఉద్దేశ్యం మాత్రం కాస్సేపు ఈ లోకం, అంటే నిప్పుల్లా కాలుస్తున్న ఈ నిజాలు కనిపించకుండా కళ్ళు మూసుకోవడమే. అంచేత నిజం చెప్పాలంటే యిదొక రకమైన ఎస్కేపిజమ్ (escapism) లాంటిది ఎస్కేపిజమ్ అయితేనేం మరో ఇజమ్ అయితేనేం ఇందులో కొంత రియలిజమ్ కూడా లేకపో లేదు. ఎంచేతంటే వాటివల్ల కూడా కొన్ని ఫలితాలు కనిపిస్తున్నా యని నాడు –నేడూ కొందరు అడపాతడపా చెప్తూనే ఉన్నారు కనుక :

ఈ రకమైన రసాల్ని ఆస్వాదిస్తూ బతికేదే ఈ కథలోని విశాలాక్షి.